క్లుప్తంగా

స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన



పర్యటిస్తున్న కేంద్ర బృందం, అధికారులు

జమ్మికుంట: మండలంలోని గండ్రపల్లి గ్రామంలో గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం శుక్రవారం పర్యటించింది. ఈసందర్భంగా ఎన్యుమరేటర్, ఏపీడీ కృష్ణ గ్రామంలోని కమ్యూనిటీ ఇంకుడుగుంతలు, సెగ్రిగేషన్ షెడ్లు, ఇళ్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పనుల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, ఎంపీవో సతీశ్‌రావు, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రమేశ్, సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ తోట కవిత, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ, ఈజీఎస్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

యూనిట్ల మంజూరు సక్రమంగా చేపట్టాలి

హుజూరాబాద్: దళితబంధు రెండో విడత యూనిట్ల మంజూరు సక్రమంగా చేపట్టాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రొంటాల బాబు కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండో విడత యూనిట్ల మంజూరుకు అధికారులు అమ్యామ్యాలకు పాల్పడుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగాఉండాలి

హుజూరాబాద్: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు సూచించారు. శుక్రవారం ప్రాంతీయ ఆసుపత్రిలో మాట్లాడారు. ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇళ్ల సమీపంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సురక్షిత నీరు తాగాలన్నారు.

జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి డాక్టరేట్



ఎండీ హుస్సేన్

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి ఎండీ హుస్సేన్‌కు డాక్టరేట్ పొందారని కాకతీయ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ప్రకటించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడు గ్రామానికి చెందిన హుస్సేన్ జమ్మికుంటలో విజ్డమ్ జూనియర్ కళాశాలలో ఇంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం (కంప్యూటర్), హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ (ఇంగ్లిష్) , బీఈడీ, ఎంబీఏ పూర్తి చేశారు. 'ముస్లిం రైటింగ్ ఇన్ ఇంగ్లిష్ ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ ఇండియన్ ఇంగ్లిష్ నవలలు'అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని జేబీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీలో అసిస్టెంట్ ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. గ్రామీణ యువతకు స్ఫూర్తిగా నిలిచిన హుస్సేన్‌ను స్నేహితులు, కుటుంబ సభ్యులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

సమ్మెకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు శుక్రవారం టీటీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్‌ఆరీఫ్ ఆరోపించారు. కార్మికులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సాబీర్, సమ్మయ్య, చందు, జీపీ సిబ్బంది జిల్లా అధ్యక్షుడు రాచర్ల మల్లేశం, మండల అధ్యక్షుడు సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాగు విస్తీర్ణం తగ్గుతోంది..

- మండలంలో పప్పుదినుసుల సాగుకు రైతుల అనాసక్తి
- ఏటా వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఫలితం శూన్యం
- వరిసాగుకే మొగ్గుచూపుతున్న వైనం



గంగాధరలో సాగు చేసిన పెసర పంట (ఫైల్)

గంగాధర: పప్పుదినుసుల సాగుపై ఏటా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా పంటల సాగు విస్తీర్ణం మాత్రం పెరగడంలేదు. ఈ సంవత్సరం వానాకాలం ఆరంభం నుంచే రైతులు సాగుకు ఆసక్తి చూపడం లేదు. గతేడాది కందులకు బహిరంగ మార్కెట్‌లో ధర తగ్గడంతో రైతులు కందిసాగు ఊసెత్తడంలేదు. వరద కాలువ నీటితో పాటు నారాయణపూర్ రిజర్వాయర్ ద్వారా చెరువులు, కుంటల్లోకి నీరు రావడం, భూగర్భ జలాలు పెరగడంతో రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు.

పెరుగుతున్న ధరలు

మెట్టప్రాంతాల్లో ఒకప్పుడు రైతులు పంటపొలంలో కొంత మేర పప్పుదినుసుల(అపరాలు) సాగు చేసేవారు. ప్రస్తుతం వాణిజ్య పంట పత్తితోపాటు వరిసాగు చేస్తున్నారు. దీంతో కంది, పెసర, శనగ వంటి పప్పు దినుసుల సాగు తగ్గుతోంది. దీంతో దిగుబడి తగ్గి పప్పుదినుసుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గతంలో రైతులు పునాసలో (ఖరీఫ్) సాగు చేసే పెసర పంటను రెండు విధాలుగా వినియోగించుకునేవారు. ఖరీఫ్ ఆరంభంలోనే వరి సాగు చేసే నేలల్లో పెసర పంట పండించేవారు. పంట చేతికందే సమయానికి విరివిగా వర్షాలు కురిసేవి. రైతులు పెసర కాయలు తీసిన తర్వాత అదే చేనును వరి సాగుకు కలియదున్నేవారు. పెసర చేను పొలంలోనే మురగడంతో సేంద్రియ ఎరువుగా ఉపయోగపడేది. కంది, శనగ పంటచేలు రెండు విధాలుగా ఉపయోగపడేవి. కందిచేను చేతికందిన తర్వాత కందిపొరక వంటచెరుకుగా. శనగ పంట చేతికందిన తర్వాత శనగ పొట్టు పశువుల దాణాగా ఉపయోగపడేది. ప్రస్తుతం పప్పుదినుసుల పంట సాగు తగ్గిపోతోంది.

ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా..

పప్పుదినుసుల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం అవగాహన కల్పిస్తున్నా, మద్దతు ధర పెంచుతున్నా రైతులు ఆసక్తి చూపడంలేదు. మండలంలో ప్రతి సంవత్సరం పప్పుదినుసుల సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. వ్యవసాయశాఖ అధికారుల సమాచారం ప్రకారం 2021 ఖరీఫ్‌లో పెసర 78 ఎకరాల్లో, కంది 958 ఎకరాల్లో సాగు చేశారు. 2022 సంవత్సరం ఖరీఫ్‌లో రెండు పంటల సాగు తగ్గింది. కంది పంట 412 ఎకరాల్లో, పెసర17 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు కంది పంట పది ఎకరాల్లో సాగు చేయగా, పెసర పంట సాగుకే నోచుకోవడంలేదు.

అవగాహన కల్పిస్తున్నాం



ఆరుతడి పంటలతో పాటు పప్పు దినుసుల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. విత్తనాలు అందుబాటులో ఉంచుతన్నాం. దిగుబడి, మద్దతు ధరలు వివరిస్తున్నాం. పప్పు దినుసులు, ఆరుతడి పంటల సాగుకు పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువగా వస్తుందని రైతులకు వివరిస్తున్నాం.

– శ్వేత, వ్యవసాయాధికారి, గంగాధర

ఈవీఎంల పనితీరుపై అవగాహన



మానకొండూర్: అవగాహన కల్పిస్తున్న అధికారులు



తిమ్మాపూర్: మాట్లాడుతున్న తహసీల్దార్ కనకయ్య

మానకొండూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలకు ఓటుహక్కు వినియోగం, ఈవీఎంలపై అధికారులు అవగాహన కల్పించారు. ప్రత్యేక వాహనంలో ఈవీఎం పనితీరును గ్రామ ప్రధాన కూడళ్ల లో వివరించారు.

చిగురుమామిడి: మరో ఐదు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితాతో సవరణకు అవకాశం కల్పించిందని తహసీల్దార్ జింక జయంత్ తెలిపారు. శుక్రవారం చిగురుమామిడిలో మాట్లాడారు. ఆగస్టు 1న ముసాయిదా జాబితా ప్రకటించి అదే నెలలో 21 నుంచి సెప్టెంబర్ 19 వరకు జాబితాలో పేరులేని వారు పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర మార్పులు చేర్పులకు వీలుగా అవకాశం కూడా ఇచ్చిందని వివరించారు. సెప్టెంబర్ 28 నుంచి అభ్యంతరాలను స్వీకరించి అక్టోబర్ 4వ తేదీన తుదిజాబితా ప్రకటించనున్నామని వివరించారు.

తిమ్మాపూర్: రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం పేరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన బీఎల్‌వోస్, బీఎల్వో సూపర్‌వైజర్లకు నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. ఓటర్ జాబితాలో తప్పులు ఉంటే సవరణ చేయాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో అన్నీ గుర్తించి తప్పులు లేని ఓటర్ జాబితా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయాబ్ తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐలు అనిలా, అక్బర్, ట్రైనర్లు శ్రీనివాస్, రవీందర్‌చారి సిబ్బంది పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు మానుకోవాలి'



మాట్లాడుతున్న నాయకులు

తిమ్మాపూర్: కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని మన్నెంపల్లి సర్పంచ్ మేడి అంజయ్య, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల మండల అధ్యక్షుడు మురళి, వంతడుపుల సంపత్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దళిత బాంధవులు అని, దళితుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా హైదరాబాద్ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సీఎం కేసీఆర్ నెలకొల్పారని, దళితబంధుతో ఎన్నో కుటుంబాలకు లబ్ధి చేకూర్చారని పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజాశ్రేయస్సు ధ్యేయంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో ఎస్సీ హాల్ కమ్యూనిటీ హాల్, నియోజకవర్గంలో మరో 1,100 మందికి దళితబంధు పథకం అమలు చేయడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు దిగజారుడుకు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నేదునూరి సర్పంచ్ శంకర్, అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకుడు లక్ష్మణ్, జలపతి, బాబు, అంజి, సంపత్, తిరుపతి, అశోక్, నందకిషోర్, సాగర్, రమేష్, అజయ్, సంపత్, రాజమల్లయ్య, కనకయ్య, ప్రభాకర్, తిరుపతి, మల్లేశ్, నరేష్, సతీష్, అశోక్, అభిషేక్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



రోడ్డుపై నాటు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం–చెర్లపల్లి రోడ్డుపై బీజేపీ నాయకులు వరినాటు వేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం రోడ్డు నిర్మించడం లేదని, రైతులతోపాటు గ్రామస్తులు సైదాపూర్ మండల ప్రజలు వానాకాలంలో బురదరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, సమ్మిరెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్, సారయ్య,జగ్గారెడ్డి, సంపత్, శివారెడ్డి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళం అందిస్తున్న యాదగిరి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గౌడ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేయనున్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ బండపెల్లి యాదగిరి శుక్రవారం రూ.10వేల విరాళం అందించారు. గౌడసంఘం అధ్యక్షుడు కొండ వెంకటయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు సుద్దాల మల్లేశం గౌడ్, డైరెక్టర్లు కాసారపు బుచ్చిరాములు గౌడ్, బుర్ర గంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చొప్పదండి: మండలంలోని మల్లన్నపల్లి గ్రామానికి చెందిన భక్తు విజయ్‌కుమార్‌ను బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం నియామకపత్రం అందించారు. నియామకానికి సహకరించిన బీఆర్ఎస్ నాయకులకు విజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

బంగారం, వెండి ఆభరణాలు ఈవోకు అందజేత



విరాళం అందిస్తున్న యాదగిరి

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి బంగారం, వెండి ఆభరణాలను శుక్రవారం ఈవో సుధాకర్‌కు గతంలో విధులు నిర్వర్తించిన అధికారులు అందించారు. మత్స్యగిరీంద్రస్వామితో పాటు అనుబంధ ఆలయాల్లో భక్తులు వెండి, బంగారం ఆభరణాలను కానుకలుగా సమర్పించారు. ఆలయానికి సంబంధించిన రికార్డులను కూడా అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారావు, దేవదాయ శాఖ అధికారులు శ్రీనివాస్, వెంకటయ్య, ఆలయ అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక వ్యాఖ్యలు తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత కరంట్ అందిస్తుంటే కాంగ్రెస్‌కు కడుపు మంట ఎందుకని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. మండలంలోని రుక్మాపూర్ రైతు వేదికలో శుక్రవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు రైతు వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారని రైతులు తిప్పికొట్టాలని కోరారు. అనంతరం కారులో వెళ్తుండగా ఓ విద్యార్థినితో మాట్లాడారు. ఇల్లు లేదని చెప్పడంతో గృహలక్ష్మి పథకం ద్వారా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, వెంకటరమణారెడ్డి, లింగయ్య, చంద్రశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కత్తరమల్ల వెంకటయ్య ఇటీవల క్యాన్సర్‌తో మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. వెంట జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధక్షుడు మహిపాల్, వెంకటేశం, రవి, పార్థసారథి ఉన్నారు.

'దోషులను కఠినంగా శిక్షించాలి'



హుజూరాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హుజూరాబాద్: మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలకు జరిగిన ఘోర అవమానంపై హుజూరాబాద్‌లో శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు, పొడిశెట్టి సుమతి, భీమోజు జయ, మాడుగుల తిరుపతమ్మ, రుద్రారపు రామచంద్రం, ఇంజం వెంకటస్వామి, వేల్పుల రత్నం, సదానందం తదితరులు ఉన్నారు.

హుజూరాబాద్‌రూరల్: దేశంలో హత్యలు, అత్యాచారలు పెరుగుతున్నాయని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని జనతాదళ్ (సెక్యులర్)పార్టీ నాయకులు వడ్లూరి వాసు అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ.. మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండటం ఏంటని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అల్లర్లు, హింసలు ఎక్కువయ్యాయని, మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రుద్రారం సురేశ్, పోగుల రాజశేఖర్ ఉన్నారు.



వ్యర్థాలు డంప్ చేస్తున్నా పట్టింపేది..?

తిమ్మాపూర్: ఎల్ఎండీలో కొంతమంది వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. కరీంనగర్ పట్టణవాసులతోపాటు తిమ్మాపూర్ మండలానికి చెందినవారు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను జలాశయం అంచున పడేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోకి నీరు చేరుతుండటంతో వ్యర్థాలు పైకి తేలుతున్నాయి. వ్యర్థాలతో నీరు కలుషితమవుతోందని పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపలు పట్టేవారితోపాటు ప్రజలకు వ్యర్థాలతో ముప్పు పొంచి ఉందని పేర్కొంటున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

సాక్షి స్పందన



తిమ్మాపూర్: మండల కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయం ఎదురుగా రాజీవ్ రహదారిని కమ్మేస్తున్న చెట్ల కొమ్మలను హెచ్‌కేఆర్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. రాజీవ్ రహదారిని కమ్మేస్తున్న చెట్ల కొమ్మలు శీర్షికన శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన తిమ్మాపూర్ సర్కిల్ సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్‌కేఆర్ నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం సిబ్బంది ఉదయం మండల కేంద్రానికి చేరుకుని రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలు తొలగించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి వాహనదారులు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తోంది

గన్నేరువరం: పేదల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో మాట్లాడారు. పేదల సొంతింటి కల ఆశగానే మిగిలిపోతోందని, గన్నేరువరంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయని విమర్శించారు. పలుమార్లు గ్రామసభలు నిర్వహించినా ఇళ్ల నిర్మాణం అతిగతి లేదన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విఫలమయ్యారని, పేదలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

మల్లికార్జున కర్గే జన్మదిన వేడుకలు

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ కర్గే జన్మదిన వేడుకలను శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేశ్వర్‌రావు, బుర్రకుమార్, పోతిరెడ్డి మల్లయ్య, మడిపల్లి అశోక్, రాచపల్లి రమేష్, సతీష్‌రెడ్డి, రంజీత్‌రెడ్డి, భిక్షపతి, ముద్దమల్ల రవి, ఏలీయా తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు జన్మదినం సందర్భంగా టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య శుక్రవారం స్వీట్లు పంపిణీ చేశారు.



దేవంపల్లి గ్రామ శివారులోని పాల చెరువు



కాట్నపల్లి ఊర చెరువు

మత్తడి దుంకుతున్న చెరువులు

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గ్రామ శివారులోని పాల చెరువు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండి మత్తడి దూకుతోంది. ఎగువ నుంచి వరదనీరు భారీగా వస్తోంది. మండలంలో ఏటా మత్తడి దూకె చెరువు ఇదే. దీంతో మత్స్యకారులు చేపల వేట మొదలుపెట్టారు.

చొప్పదండి: భారీ వర్షాలకు మండలంలోని పలు చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులలోకి నీరు వచ్చి చేరుతోంది. మండలంలోని కాట్నపల్లి ఊర చెరువు వర్షం నీటితో నిండి మత్తడి దూకుతోంది. మత్తడి చూడటానికి రైతులు తరలివస్తున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.